సాక్షి
బాపట్ల

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



ఆక్రమణలు తొలగింపు

పెదకూరపాడు: పెదకూరపాడులో ఆక్రమణలు గురువారం తొలగించారు. తహసీల్దారు డానియేలు, ఎంపీడీవో రామకృష్ణ పర్యవేక్షించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,07,651 క్యూసెక్కులు వచ్చిచేరుతుండి. 1,86,018 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.



రూ.ఐదు లక్షలు విరాళం

నరసరావుపేటఈస్ట్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి కృష్ణవేణి డిగ్రీ కళాశాల రూ.5లక్షలను విరాళంగా ప్రకటించింది. సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేశారు.

న్యూస్‌రీల్

బాపట్ల డీఆర్‌ఓగా గంగాధరగౌడ్

బాపట్ల : బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారిగా గంగాధర్‌గౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ డీఆర్‌ఓగా పని చేస్తున్న సత్తిబాబును సెక్రటేరియట్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

జిల్లా డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా పురుషోత్తం

బాపట్ల: బాపట్ల జిల్లా స్కూల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా ఎస్.పురుషోత్తంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల డీఎస్‌ఓగా పనిచేస్తున్న నారాయణ డైట్ కళాశాల అధ్యాపకులుగా బదిలీపై వెళ్లారు. చిత్తూరు జిల్లా మదనపల్లిలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎస్.పురుషోత్తం ఉద్యోగోన్నతిపై డీఎస్‌ఓగా బాపట్లకు బదిలీపై వస్తున్నారు.

ఈ- కేవైసీకి 9 వేల మంది రైతులు దూరం



కొరిటిపాడు(గుంటూరు): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 9 వేల మంది రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకున్నప్పటికీ ఈ-కేవైసీ మాత్రం చేసుకోలేదు. గుంటూరు జిల్లాలో 93,072 మంది రైతులు 2,24,678.42 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు చేసుకున్నారు. ఈ-కేవైసీ మాత్రం 2,14,673.72 ఎకరాలకు సంబంధించి 84,068 మంది రైతులు చేయించుకున్నారు. 9,004 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోలేదు. పంటల బీమా వర్తింపు, రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, నష్ట పరిహారం, పంట ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయం వంటి వాటికి రెండు ప్రక్రియలు పూర్తి కావాల్సిందే. ఈ-కేవైసీ 90.40 శాతం పూర్తయిందని, 9 వేల మంది రైతులు చేయించుకోవాల్సి ఉందని జిల్లా వ్యవసాయ అధికారినున్న వెంకటేశ్వర్లు తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది పలుమార్లు ప్రయత్నించినప్పటికీ పలువురు స్పందించడం లేదన్నారు.

గుంటూరు, పల్నాడు జిల్లాలకు కొత్త డీఈవోలు



సీవీ రేణుక (గుంటూరు)



ఎల్. చంద్రకళ (పల్నాడు)

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు, పల్నాడు జిల్లాలకు కొత్త డీఈవోలు రానున్నారు. గురువారం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జిల్లా విద్యాశాఖాధికారుల బదిలీల్లో భాగంగా గుంటూరుకు సీవీ రేణుకను నియమించింది. ఏపీ పాఠశాల విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న రేణుక గతంలో కృష్ణా జిల్లా డీఈవోగా పని చేశారు. ప్రస్తుతం గుంటూరు డీఈవోగా ఉన్న పి. శైలజకు బదిలీల్లో భాగంగా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. బోయపాలెం మండలంలోని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్‌గా వైజాగ్ డీఈవో ఎల్. చంద్రకళ నియమితులయ్యారు. ఆమెకు పల్నాడు డీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. పల్నాడు ఇన్‌చార్జి డీఈవోగా వ్యవహరిస్తున్న ఎం.వెంకటేశ్వర్లును అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు.

ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తునకు సీసీ కెమెరాలు కీలకంగా మారాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ (పీఎస్) పరిధిలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 24 గంటలు పనిచేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో గతంలో ఉన్న కెమెరాల పనితీరును పునఃపరిశీలించాలని పేర్కొన్నారు. వాటి పనితీరుపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రస్తుతం చోటు చేసుకుంటున్న నేరాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా నేరాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఆనంద పడ్డారొయ్యో

రొయ్యలే...రొయ్యలు

- సముద్రంలో వెనామీ...టైగర్ లభ్యం
- అందుకు అనుగుణంగా వలలు సిద్ధం చేస్తున్న మత్స్యకారులు
- సముద్రపు రొయ్యకు చైనాలో డిమాండ్
- కళకళలాడుతున్న ఓడరేవు మార్కెట్
- మత్స్యకారులలో ఆనందం



వెనామీ రొయ్యలు

బాపట్ల : సముద్రపు వేట మత్స్యకారులలో ఆనందాలను నింపుతోంది. రెండు నెలలుగా వారి వలలు రొయ్యలతో నిండిపోతున్నాయి. దీంతో నాలుగైదు రోజులు వేట చేసే మత్స్యకారులు రెండు, మూడు రోజులకే వేట ముగించుకుని బయటకు వచ్చి మళ్లీ వేటకు వెళుతున్నారు. సహజంగా వేటకు వెళ్లిన ప్రతిసారీ కొనమ్..చందవాలు..మొయ్య..పండు చేపలు లభిస్తాయి. కానీ ఈసారి రొయ్యలు లభిస్తున్నాయి. దీంతో అందుకు అనుగుణంగా వలలను సిద్ధం చేసుకుంటున్నారు. సాధారణంగా ఆక్వా సాగులో 40 నుంచి 25 కౌంట్ చూడాలంటే రైతులకు ఎంతో కష్టంగా ఉంటుంది. సముద్రంలో ఇటీవల 20 కౌంట్ రొయ్యలు కూడా లభిస్తున్నాయి. సముద్రపు రొయ్యకు చైనాలో మంచి డిమాండ్ ఉండటంతో సముద్ర తీరంలోని ఓడరేవు మార్కెట్ రొయ్యల మార్కెట్‌తో కళకళలాడుతుంది.

వేట సాగుతుంది ఇలా...

బాపట్ల మండలం అడవిపల్లెపాలెం, కృపానగర్, దాన్వాయ్‌పేట, ఓడరేవులలో వేట వేగవంతంగా సాగుతుంది. ఈ ప్రాంతంలో మూడు వేల కుటుంబాలు ఉన్నాయి. 800 వరకు వేట సాగించే పడవలు ఉన్నాయి. చేపల వేటకు ఉపయోగించే వలలు కాకుండా రొయ్యలకు డిస్కో వలలను ఉపయోగించటం వలన రొయ్యల వేట సంతృప్తికరంగా ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. ఒక్కొక్క పడవకు ఎనిమిది నుంచి 10 మంది వేటకు వెళుతున్నారు. వెనామీ రొయ్య, టైగర్ రొయ్యలు వలలకు పడుతున్నాయి. 400 కేజీలు వెనామీ రొయ్యలు పడితే వాటిలో 40నుంచి 50 కేజీలు టైగర్ రొయ్యలు ఉంటున్నాయి. అదీ 20 నుంచి 40 కౌంట్ ఉన్న రొయ్యలు కావడం గమనార్హం. ప్రస్తుతం మార్కెట్‌లో వెనామీ 40 కౌంట్ రొయ్యలు కిలో రూ.480 నుంచి 500 ఉండగా, టైగర్ 20 కౌంట్ రొయ్యలకు రూ.800 నుంచి రూ.900 ధర పలుకుంది.



వేటకు కావాల్సిన వస్తువులను పడవల్లోకి ఎక్కించుకుంటున్న మత్స్యకారులు



వలలను బిగించుకుంటున్న మత్స్యకారులు

ఖర్చు తగ్గింది..



వాతావరణం అనుకూలంగా ఉండటంతో సముద్ర తీరం నుంచి 20 నుంచి 30 కిలోమీటర్లు వెళ్లే సరికే మత్స్యసంపద దొరుకుతుండడంతో ఖర్చులు కూడా తగ్గాయి. ఒక్కసారి వేటకు వెళితే గతంలో రూ.25 నుంచి రూ.30వేలు ఖర్చు అవుతుంది. ఇప్పుడు రూ.20వేలలోపే ఖర్చు అవుతోంది.

– జి.అప్పలరాజు, మత్స్యకారుడు

ఓడరేవులోనే మార్కెట్



రొయ్యలు ఎక్కువ పడుతుండడంతో చీరాల ఓడరేవుకే ఎక్కువ మంది కొనుగోలుదారులు వస్తున్నారు. వారం రోజులలోపు కొనుగోలు చేసిన వాటికి నగదు చెల్లిస్తున్నారు. ఐస్, సబ్సిడీపై డీజిల్ అందిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

– చొక్కా సత్యనారాయణ, మత్స్యకారుడు

పంటల బీమా పథకానికి పేర్లు నమోదు చేయాలి

జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

బాపట్ల: పంటల బీమా పథకానికి రైతుల పేర్లు నమోదు ప్రక్రియ వేగంగా చేపట్టాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. పంటల బీమా పథకం అమలు తీరుపై వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ బి రాజశేఖర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో గురువారం రాష్ట్ర రాజధాని నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. వీక్షణ సమావేశానికి జిల్లా నుంచి జిల్లా సంయుక్త కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు, హాజరయ్యారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులతో జిల్లా సంయుక్త కలెక్టర్ కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. పంటల బీమా పథకానికి రైతులే ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ విషయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. డిసెంబర్ 15వ తేదీ నాటికి పంటల బీమా నమోదు ప్రక్రియ ముగించాలన్నారు. సీఎస్‌సీ సెంటరు, సచివాలయాలకు వచ్చి రైతులు తమ ప్రీమియాన్ని చెల్లించవచ్చన్నారు. సీసీఆర్‌సీ కార్డుదారులకు లబ్ధి చేకూర్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులకు అవగాహన కల్పించడంలో నిర్లిప్తత ఉండరాదన్నారు. ప్రచార కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలలో టాటా సంస్థ సహకారం ఉంటుందన్నారు. పంటల బీమా పథకానికి రైతులు స్వచ్ఛందంగా వచ్చి ప్రీమియం నగదు చెల్లించవచ్చన్నారు. మండలం, గ్రామస్థాయిలో వారానికి ఒకసారి సమావేశాలు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో జిల్లా నుంచి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, ఉద్యాన శాఖ ఏడీ జె జన్నెమ్మ, సీపీఓ శ్రీనివాసరావు, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

పశుగణన సమర్థంగా నిర్వహించాలి

పశు గణన కార్యక్రమం బాపట్ల జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. పశు గణనకు సంబంధించిన గోడపత్రాలు, బ్రోచర్లు, స్టిక్కర్లు, సూచన పుస్తకాలను గురువారం తన చాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా 21వ పశు గణన అక్టోబర్ 25 నుంచి 2025 ఫిబ్రవరి 28 తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలన్నారు. జిల్లాలో 4.80 లక్షల కుటుంబాలు ఉన్నట్లు అంచనా వేశామన్నారు. ప్రతి కుటుంబాన్ని సందర్శించి పశు గణన చేపట్టేందుకు అధికారులు, సిబ్బంది అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పశు గణన ద్వారా పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలతోపాటు వివిధ రకాల కోళ్లు పక్షులతో సహా 16 రకాల పెంపుడు జంతువులపై జాతుల వారీగా సమాచారాన్ని సేకరిస్తారన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి వేణుగోపాల్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వి శ్రీనివాసరావు, పశు సంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు కోర్టు ఆదేశం

తెనాలిరూరల్: విధి నిర్వహణలో అలక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించడంలో నిర్లక్ష్యం చేసిన పంచాయతీ కార్యదర్శిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. న్యాయశాఖ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా వేమూరు మండలం చావలి గ్రామంలోని కొంత పోరంబోకు స్థలానికి సంబంధించి అదే గ్రామానికి చెందిన ఊసా శివ నాగేశ్వరరావు 2020లో పొజిషన్ సర్టిఫికెట్ పొందాడు. దీనిపై గ్రామంలోని కొందరు ఆక్షేపించగా, సదరు స్థలంపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా చూడాలని శివనాగేశ్వరరావు, ఊసా రాజేష్ 2020లో తెనాలి ప్రిన్సిపల్ సివిల్ కోర్టు(జూనియర్ డివిజన్)ను ఆశ్రయించారు. చావలికే చెందిన గాజుల వీరాంజనేయులు, చావలి గ్రామ పంచాయతీని ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీన కేసు విచారణకు రావడంతో న్యాయమూర్తి కేసును కొట్టివేశారు. 2020లో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి కేసు విచారణ సందర్భంగా కోర్టుకు హాజరై పొంతన అలేని సమాధానం ఇచ్చారని కోర్టు భావించింది. సంతకం తనది కాదని సదరు కార్యదర్శి చెప్పినట్లు కోర్టు రికార్డు చేసింది. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ కోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది.

గేదెలను కొనుగోలు చేసేందుకు వెళ్తుండగా..

- మోపెడ్‌ను ఢీకొట్టిన వ్యాన్
- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి
- రెండు గ్రామాల్లో విషాదఛాయలు





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మీరావలి, ఖాసింసైదా

అద్దంకి రూరల్: గేదెలను కొనుగోలు చేసేందుకు వెళ్తుండగా మోపెడ్‌ను ఓ వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ప్రమాదం అద్దంకి సమీపంలోని శ్రీనివాసనగర్ వద్ద గురువారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. బల్లికురవ మండలం మక్కెనవారిపాలేనికి చెందిన ఎస్కే మీరావలి (50) గేదెల వ్యాపారం చేస్తుంటాడు. కొప్పరపాడుకు చెందిన ఖాసిం సైదా (50) వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇరువురు బంధువులు కావటంతో గురువారం మీరావలి, ఖాసిం సైదాను తీసుకుని గేదెలు కొనుగోలు చేసేందుకు టీవీఎస్ మోపెడ్‌పై అద్దంకి-నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై అద్దంకి బయలుదేరారు. ఈక్రమంలో మార్గంమధ్యలో అద్దంకి సమీపంలోని శ్రీనివాసనగర్ వద్దకు రాగానే వెనుక వైపు నుంచి వస్తున్న బొలెరో మోపెడ్‌ను ఢీకొట్టింది. దీంతో మీరావలి, ఖాసిం సైదా కిందపడ్డారు. మోపెడ్‌ను వ్యాన్ చాలా దూరం వరకు ఈడ్చుకు పోయింది. ఈ ఘటనలో ఇరువురు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న అద్దంకి ఎస్సై ఖాదర్‌బాషా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మక్కెనవారిపాలేనికి చెందిన మృతుడు మీరావలికి భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. అందరికి పెళ్లిళ్లు అయ్యాయి. కొప్పరపాడుకు చెందిన ఖాసిం సైదాకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో ఒక కుమారుడు అవివాహితుడు. ఇరువురి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విలపిస్తున్నారు. మృతులు ఇరువురు గ్రామాల్లోని అందరితో సత్సంబంధాలు కలిగి ఉండటంతో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నరసరావుపేట కేంద్రంగా శిశు విక్రయాలు

- కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు
- అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు
- అదుపులో అనుమానితులు
- నాలుగు శిశు విక్రయాలు జరిగినట్లు నిర్ధారణ

నరసరావుపేట టౌన్/ఈస్ట్: పల్నాడు జిల్లా నరసరావుపేట కేంద్రంగా శిశు విక్రయాల రాకెట్ వెలుగులోకి వచ్చింది. గత కొన్నేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా ముక్కుపచ్చలారని పసికందులను దళారులు విక్రయాలకు పాల్పడుతున్నట్టు తెలియవచ్చింది. ఈవ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందినట్టు సమాచారం. దీనిపై స్పందించిన కలెక్టర్ తదుపరి విచారణ చేపట్టాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించినట్టు తెలిసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. గతంలో స్టేషన్ రోడ్డులోని ప్రముఖ ప్రైవేటు వైద్యశాలలో ఆయాగా పని చేసిన మహిళ ఈ శిశు విక్రయాలలో కీలకపాత్ర పోషించినట్టు తెలుసుకున్న ఆమెను అదుపులోకి తీసుకొని మహిళా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణలో నలుగురు శిశువులను తాను మధ్యవర్తిత్వం చేసి విక్రయించినట్లు అంగీకరించినట్టు తెలిసింది. ఆమె ఇచ్చిన సమచారంతో విక్రయానికి గురైన చిన్నారిని గుర్తించారు. సదరు చిన్నారిని శిశు సంక్షేమ శాఖాధికారులకు అప్పగించినట్టు సమాచారం. చిన్నారిని కొనుగోలు చేసిన వారిని విచారించారు. బిడ్డను విక్రయించిన తల్లిదండ్రులను విచారించగా తమ ఆర్థిక పరిస్థితి బాగోలేక పాపను ఇచ్చినట్టు అంగీకరించినట్టు తెలియవచ్చింది. విక్రయానికి గురైన మరో బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

ప్రాణాలు తీస్తున్న డయేరియా



నాగరాజుకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

దాచేపల్లి : కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత తాగునీరు, పారిశుద్ధ్యం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దాచేపల్లి అంజనాపురం కాలనీలో వాంతులు, విరేచనాలతో ప్రజలు మంచం పడుతున్నారు. డయేరియాతో ఇద్దరు మృతి చెందగా మరో 14 మంది చికిత్స పొందుతున్నారు. కాలనీలో నివాసం ఉంటున్న బండారు చిన్న వీరయ్య, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ డయేరియా బారిన పడి మృత్యువాతపడ్డారు. 14 మంది బాధితుల్లో కార్తీక, శాంతమ్మ, దుర్గారావు, సైదారావుల ఆరోగ్య పరిస్థితి కొంత ఇబ్బందికరంగానే ఉన్నది. ఎప్పుడు ఎటువంటి వార్త వినాల్సి వస్తుందో అని కాలనీ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురౌతున్నారు.

కాలనీలో పడకేసిన పారిశుద్ధ్యం

అంజనాపురం కాలనీలో పారిశుద్ధ్యం పడకేసింది. పేరుకే నగర పంచాయతీలో ఈ కాలనీ ఉన్న ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఈ కాలనీలో వీధులు బురదమయంగా ఉన్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటం వలన మురుగు రోడ్లపైనే పారుతోంది. కాలనీ ప్రజలకు తాగునీరు అందించే పైపులైన్లు మురికి కుపాల్లోనే ఉన్నాయి. తాగునీటి బోరులోకి మురుగు నీరు, సెప్టిక్ ట్యాంక్‌లోని నీరు చేరటం వలన కలుషితం అవుతున్నాయి. దీంతో ప్రజలు వాంతులు, విరేచనాల బారినపడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన బోరుకున్న పైపులైన్లను తొలగించి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కలుషితం అవుతున్న బోరుకి కనెక్షన్ ఇచ్చినట్లుగా కాలనీవాసులు చెబుతున్నారు. ఈ బోరు నుంచి వచ్చే నీరు తాగటం వలనే మాకు ఈ పరిస్థితి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం బాధ్యత వహించాలి



డయేరియా మరణాలకు ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బాధ్యత వహించాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో డయేరియాతో ఇద్దరు మృతి చెందటం పట్ల ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. డయేరియాతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 14 మంది త్వరగా కోలుకొవాలని ఆకాంక్షించారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

- ప్రత్యేక బృందం అధికారులు
- పథకాల అమలు పరిశీలన



వరహాపురం గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

వేమూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా వినియోగించుకోవాలని ప్రత్యేక బృందం అధికారులు లోహితరెడ్డి, శ్రీరాం రెడ్డి అన్నారు. నేషనల్ లెవల్ మానిటరింగ్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరును గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరుపేదలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడం, గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేయడం, ప్రభుత్వం కార్యాలయాలు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం అమలు తీరు గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పథకం ద్వారా కూలీలు చేసిన పనులు పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా 1.80 లక్షల ఇళ్ల మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలోని జంపని, వరహాపురం గ్రామాల్లో పంట కాలువలు, జంపని గ్రామంలో గ్రామ సచివాలయం, పంట కాలువలు పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సువార్త, ఏపీఓ సత్యకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ జగన్ పాల్గొన్నారు.

మాతా,శిశు సంరక్షణే ధ్యేయం

గుంటుపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన జాతీయ హెల్త్ మిషన్ టీం



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ టీం

బల్లికురవ: మాతా శిశు సంరక్షణే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని..ఇందు కోసం ప్రతి ఏటా కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నట్లు జాతీయ హెల్త్ మిషన్ టీం సభ్యులు తెలిపారు. గురువారం బల్లికురవ మండలంలోని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని టీం సభ్యులు తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు గర్భిణుల, చిన్నారుల రిజిస్ట్రేషన్‌ను సకాలంలో పూర్తిచేయాలన్నారు. అప్పుడే ప్రభుత్వ పరంగా వారి అందే సాయాన్ని సకాలంలో అందించవచ్చన్నారు. ప్రధాన మంత్రి మాత వందనంలో మొదటి రెండో కాన్పుకు రూ.5000 చొప్పున, జననీ సురక్ష యోజనలో రూ.1000 పొందవచ్చని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సాయంపై ఏఎన్‌ఎంలు అవగాహన పెంపొందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పించామని కాన్పులు, ల్యాబ్ పరీక్షలు ఇక్కడే చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. తనిఖీలో పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ అరుణ్ గైకీ, వైద్య, ఆరోగ్యశాఖ డీఐవో వెంకటేశ్వర్లు టీం సభ్యులు మల్లికార్జున్, ప్రేమ పావని, వైద్యాధికారులు షేక్ రమీజ్ అహ్మద్, జి రవితేజ, భారతి పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మృతిపై విచారణ జరపాలి

జిల్లా ఎస్పీని కలిసిన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావుది ముమ్మాటికి హత్యేనని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. గురువారం ఆయన జిల్లా ఎస్పీ తుషార్ డూడిని కలిసి ఫిర్యాదు చేశారు. హత్య కేసులో స్థానిక పోలీసులు సరైన రీతిలో దర్యాప్తు చేయడం లేదని ఆయన ఎస్పీకి వివరించారు. పులి శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ నాయకుడని, పార్టీ కార్యక్రమాల్లోనూ, గ్రామంలో అందరితో కలివిడిగా ఉంటాడన్నారు. ఆయనను ఉద్దేశపూర్వకంగా హత్య చేశారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఆయన ఇంట్లో ఉండగా ఫోన్ చేసి పిలిపించి హత్య చేశారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ వ్యవహారంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఇటీవల గడియార స్తంభం సెంటర్‌లో ఆందోళన చేశారు. కేసులో దర్యాప్తును వేగవంతం చేసి నిజానిజాలు నిగ్గు తేల్చాలని ఆయన కోరారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారులు వీరే


సెలక్షన్ పోటీలను ప్రారంభిస్తున్న కారుణ్య సేవా సమితి నిర్వాహకులు


పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చీరాల రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, 17 షటిల్ బ్యాడ్మింటన్ సెలక్షన్ పోటీలు గురువారం రావి జయలక్ష్మి, సుబ్బారాయుడు ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. పోటీలను కారుణ్య సేవాసమితి సెక్రటరి గోవర్ధన్ చేతులు మీదుగా ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాల నుంచి 200 మంది బాల, బాలికలు ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. కారుణ్య సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో క్రీడాకారులకు టెక్నికల్ ఆఫీసర్లకు, ఫిజికల్ డైరెక్టర్స్‌కు ఉచిత భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలలో రాణించిన క్రీడాకారులు ఈనెల 28న కోనసీమ జిల్లాలోని మల్కిపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ కబీర్, మూర్తి, ఎం. సీతాదేవి, కె. రాణి, శ్రీనివాసరావు, కోచ్ ప్రసాద్, అన్ని పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు..
అండర్–17 బాలుర విభాగంలో వై. తారక్‌రామ్ , బి. ప్రేమ్‌కుమార్, డి. వెంకటేశ్వర్లు, వై. ఆదిత్య, కె. అభిలాష్.

అండర్–14 బాలుర విభాగం..
జి. షణ్ముఖవర్ధన్, సీహెచ్ అరుణ్‌కుమార్, జి. విహాస్ జోష్, పీవీఎస్ఎస్ విపిన్, ఎస్డీ జునేద్, పి. వేదదినేష్,

అండర్–17 బాలికలు..
జి. నిఖిత, డి. భువనశ్రీ, జి. యువిక, ఎల్. లాస్య, జి. రిషితలు ఎంపికయ్యారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలి దుర్మరణం


మృతి చెందిన మహాలక్ష్మి

చినగంజాం: రోడ్డుపై నడిచి వెళ్తున్న వృద్ధురాలిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందింది. ఈఘటన చినగంజాం–కడవకుదురు మార్గంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చినగంజాం పంచాయతీ పూలవారిపాలెం గ్రామ పరిధిలో నివాసం ఉంటున్న సోమిశెట్టి మహాలక్ష్మి (90) గురువారం ఉదయం 8 గంటల సమయంలో చినగంజాం–కడవకుదురు మార్గంలోని తారు రోడ్డులో బహిర్భూమికై వెళ్తోంది. ఈ సమయంలో ట్రాక్టర్‌కు రోటవేటర్ కట్టుకొని వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి వృద్ధురాలికి నాగలిని తాకించాడు. దీంతో కింద పడిపోయిన మహాలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను 108 వాహనంలో చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరిశీలించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్ రమేష్ తెలిపారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం


యూనివర్సిటీ స్థాయికి ఎంపికైన గిరిజా రెడ్డి

వేటపాలెం: యూనివర్సిటీ స్థాయి తైక్వాండో పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో యూనివర్సిటీ స్థాయి తైక్వాండో పోటీల్లో గురువారం నిర్వహించారు. ఈపోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు గురువారం తెలిపారు. ఈపోటీల్లో సెయింటాన్స్ విద్యార్థులు ఆరు బంగారు, ఒక వెండి పతకాలు సాధించారని చెప్పారు. కాకినాడ జేఎన్టీయూ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి యూనివర్సిటీ స్థాయి ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్, సెలక్షన్స్ పోటీలు నిర్వహిస్తున్నారని ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు తెలిపారు. ఈసందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

ఆల్ ఇండియా యూనివర్సిటీకి గిరిజారెడ్డి
చినగంజాం: తైక్వాండో ఆల్ ఇండియా యూనివర్సిటీ ఇంటర్ సెలక్షన్స్‌లో చినగంజాంకు చెందిన తైక్వాండో క్రీడాకారిణి కుంచాల గిరిజారెడ్డి ఎంపికయ్యారు. గురువారం ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీలో నిర్వహించిన ఇంటర్ సెలక్షన్స్ నిర్వహించారు. అండర్–55 కేజీ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన గిరిజా రెడ్డి హర్షిణీ డిగ్రీ కళాశాల నుంచి ఆలిండియా యూనివర్సిటీకి అర్హత సాధించింది. నవంబరు 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని అమృతసర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటుందని కోచ్ వాటుపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఎస్‌జీఎఫ్ ఉమ్మడి గుంటూరు ఎంపిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ క్రీడల ఉమ్మడి గుంటూరు జిల్లా జట్లు ఎంపిక పోటీల వివరాలను గురువారం స్కూల్ గేమ్స్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ప్రకటించారు. పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు ఆయా క్రీడల సమయంలో ఉదయం 9 గంటలకు తగిన సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

తేదీ	క్రీడలు	విభాగం	ప్రదేశం
అక్టోబర్ 25	కబడ్డీ	అండర్–17(బాలురు)	జడ్పీ హైస్కూల్, చినకాకాని
అక్టోబర్ 25	యోగా	అండర్–17 (బాల బాలికలు)	జడ్పీ హైస్కూల్, రావెల
అక్టోబర్ 26	యోగా	అండర్–14 (బాల బాలికలు)	జడ్పీ హైస్కూల్, పెనుమాక
అక్టోబర్ 26	బాల్ బాడ్మింటన్	అండర్–14, అండర్–17 (బాలురు)	జడ్పీ హైస్కూల్, పసుమర్రు
అక్టోబర్ 26	స్విమ్మింగ్	అండర్–14, అండర్–17 (బాల బాలికలు)	ఎస్ఎస్అండ్ఎన్ కళాశాల, నరసరావుపేట
అక్టోబర్ 28	అథ్లెటిక్స్	అండర్–14 (బాల బాలికలు)	జడ్పీ హైస్కూల్, సిరిపురం
అక్టోబర్ 28	ఖోఖో	అండర్–17 (బాల బాలికలు)	జడ్పీ హైస్కూల్, నకరికల్లు
అక్టోబర్ 29	బాల్ బాడ్మింటన్	అండర్–14, అండర్–17 (బాలికలు)	జడ్పీ హైస్కూల్, శావల్యాపురం
అక్టోబర్ 30	సాఫ్ట్‌బాల్	అండర్–17 బాల బాలికలు	జడ్పీ హైస్కూల్, రావెల

నకిలీ బ్రాండెడ్ సిగరెట్లు స్వాధీనం


మిని లారీ, సిగరెట్లను స్వాధీనం చేసుకున్న దృశ్యం

లక్ష్మీపురం: నకిలీ బ్రాండెడ్ సిగరెట్లను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి సారథ్యంలో యాంటీ ఎవేషన్ అధికారులు గురువారం ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామం వద్ద తనిఖీలు నిర్వహించారు. డ్రైవర్ వద్ద ఇన్వాయిస్‌ను పరిశీలించగా అందులో అగ్గిపెట్టెలు ఉన్నట్లు ఉంది. వాటి విలువ రూ.2.77 లక్షలుగా చూపించారు. లారీలో ఉన్న 46 పాలీ బ్యాగులను విప్పి చూడగా మొత్తం రూ.11.04 లక్షల విలువైన సిగరెట్లు లభించాయి. జీఎస్టీ చెల్లించలేదని నిర్ధారణ అవటంతో సిగరెట్లు, లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సిగరెట్ల మార్కెట్ విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. నకిలీ బ్రాండెడ్ ఉత్పత్తులుగా నిర్ధారించారు. యాంటీ ఎవేషన్ అధికారులు బి.లక్ష్మీనారాయణ, జి.రవికుమార్, ఎం.నాగరాజు , గాదె శ్రీనివాసరెడ్డి, నవీన్ రాజు, యుగంధర్, టీవీజీకే మూర్తి పాల్గొన్నారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

- నిందితుల నుంచి 22.5 కిలోల గంజాయి స్వాధీనం
- కార్మికులు, కళాశాల విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు

చేబ్రోలు: ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకొచ్చి స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు, కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్న నలుగురు నిందితులను చేబ్రోలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి పొన్నూరు రూరల్ సీఐ వై. కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ డి. వెంకట కృష్ణలు వెల్లడించిన వివరాల మేరకు... గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలోని గజవెల్లి స్పిన్నింగ్ మిల్లు సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఉన్న నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 22.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా నవనంపాడు గ్రామానికి చెందిన కోటిపల్లి రాజా, వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన నీలా థామస్, ఒడిశా రాష్ట్రం మాపోడర్ గ్రామానికి చెందిన సంతోష్ గౌడ్, పొన్నూరు పట్టణం డఫ్‌పేటకు చెందిన షేక్ ఫజల్‌లు గంజాయి తాగడానికి అలవాటు పడ్డారు. ఆపై సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయిని తీసుకొచ్చి చిన్న పొట్లాలుగా చేసి విక్రయిస్తున్నారు. చేబ్రోలు, తెనాలి మండలాల్లోని స్పిన్నింగ్ మిల్లులలో పనిచేసే కార్మికులకు, నిరుద్యోగులకు, ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు, యువకులకు విక్రయించి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసు ఉన్నతాధికారులకు అందిన సమాచారంతో తనిఖీలు చేపట్టారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఎస్ఐ డి వెంకట కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పులిచింతలకు 1,88,220 క్యూసెక్కులు విడుదల



సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు ద్వారా 1,88,220 క్యూసెక్కుల నీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ జయపాల్ గురువారం తెలిపారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు 12 క్రస్ట్‌గేట్లు 3 మీటర్లు ఎత్తు ఎత్తి 1,88,220 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న కృష్ణానదికి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులో నున్న రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 75.50 మీటర్లకు గాను 75.39 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. ప్రాజెక్టు రిజర్వాయర్‌లో గరిష్ట నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకు గాను ప్రస్తుతం 7.004 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 59.72 మీటర్లకు చేరుకుందన్నారు. నాగార్జునసాగర్ నుంచి 1,90,826 క్యూసెక్కుల వరదనీరు టెయిల్‌పాండ్ రిజర్వాయర్‌కు వస్తుందన్నారు.

జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి


శ్రీనివాసరెడ్డిని అభినందిస్తున్న కమిటీ సభ్యులు

భట్టిప్రోలు: జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా భట్టిప్రోలు మండలం జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఇస్తర్ల బాబురావు, ప్రధాన కార్యదర్శి పి. సురేంద్రలు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తుమ్మా బుచ్చిరెడ్డి (పెరవలి జెడ్పీ హైస్కూల్ పీడీ), బి. శ్రీనివాసరావు (ముత్తుపల్లి జెడ్పీ హైస్కూల్ పీడీ)లు ఐలవరం హైస్కూల్‌కు వెళ్లి శ్రీనివాసరెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి తన నియామకం పట్ల అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు. షూటింగ్ బాల్ అసోసియేషన్ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

మకరమా... నీ జాడెక్కడే?

- చెక్ డాం వద్ద మొసలి కోసం అధికారుల ఆరా
- స్థానికులకు భద్రతా సూచనలు


మొసలి జాడ కోసం వెతుకుతున్న అధికారులు

మార్టూరు: వాగులో మొసలిని వెతకడానికి అధికారులు విశ్వప్రయత్నం చేసినా ఆచూకీ దొరకలేదు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం రాజుగారిపాలెం గ్రామంలోని వాగుకు అనుసంధానంగా ఉన్న చెక్ డాం సమీపంలో మొసలిని చూసినట్లు పోలీసు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ పోలీస్, రెవెన్యూ అధికారులు గ్రామస్తులతో కలిసి వాగు, చెక్ డాం పరిసరాలను విస్తృతంగా గాలించారు. కానీ ఎలాంటి ఫలితం కనిపించలేదు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారి రమేష్ స్థానికులతో మాట్లాడుతూ గ్రామస్తులు అప్రమత్తంగా ఉంటూ ఈ పరిసరాల్లో సంచరించరాదని చెప్పారు. పశువులను నీటి కోసం వదలరాదని, నీటి మడుగులో మొసలి జాడ ఉన్నట్లయితే మొసలి తాలుకు మల విసర్జన ద్వారా దాని ఆచూకీ తెలుసుకోగలమని అన్నారు. స్థానికులు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఆచూకీ లభించినా తమకు తెలియజేయాలని కోరారు. నీటిమడుగులో మొసలి ఉంటే శ్రీశైలం నుంచి మొసలిని పట్టుకొనే టీంను రప్పించి దానిని పట్టుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

ఐలవరం హైస్కూల్‌కు అర్జెంటీనా ఉత్తరాలు


అర్జెంటీనా విద్యార్థులు పంపిన లెటర్స్ చూపుతున్న ఐలవరం హైస్కూల్ విద్యార్థులు

భట్టిప్రోలు: సౌతాఫ్రికాలోని అర్జెంటీనా దేశ రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లోని మాడ్రియాన్ ల్యాబ్ స్కూల్ ఆఫ్ ఇంగ్లీష్, ఎస్క్యూలా మున్సిపల్ డిపెస్కా పాఠశాలల్లో చదువుతుచున్న 30 మంది విద్యార్థులు ఆంగ్లోపాధ్యాయురాలు సొలిడాడ్ ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు పెన్‌పాల్ లెటర్స్ పంపారు. గత కొంతకాలంగా ఐలవరం హైస్కూల్ విద్యార్థులు ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన విద్యార్థులతో పెన్‌పాల్ విధానాన్ని కొనసాగిస్తున్నారు. ఇవి గురువారం హైస్కూల్‌కు చేరుకున్నాయి. వీటిని ప్రధానోపాధ్యాయులు మాచర్ల మోహన్ రావు ఆవిష్కరించి విద్యార్థులకు అందచేశారు. ఈ కార్యక్రమాన్ని హైస్కూల్ ఆంగ్లోపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ, అర్జెంటీనా ఆంగ్లోపాధ్యాయురాలు సొలిడాడ్ కొలాబరేషన్‌తో నిర్వహిస్తున్నారు. అక్కడి విద్యార్థులు లెటర్స్‌తో పాటు ఆ దేశ కరెన్సీ 'పెసో'ను కూడా పంపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బద్రినాథ్, కిషోర్, తాండవకృష్ణ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టు

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్


రేషన్ డీలర్లకు సూచనలందిస్తున్న డీఎస్‌వో విలియమ్స్

చీరాల టౌన్: జాతీయ ఆహార పంపిణీ పథకంలో భాగంగా రేషన్ కార్డుదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయకుండా డీలర్లు అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్ హెచ్చరించారు. గురువారం చీరాల పట్టణం, రూరల్ రేషన్ డీలర్లతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ.. ప్రభుత్వం రేషన్ కార్డుదారులు నవంబర్ నుంచి బియ్యం, పంచదారతో పాటుగా కందిపప్పు కూడా సరఫరా చేస్తుందన్నారు. ప్రతీ కార్డుదారుడికి విధిగా అన్ని రకాల రేషన్ సరుకులు పంపిణీ చేయాలన్నారు. పేద ప్రజలకు అందించే రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయకుండా అక్రమంగా అమ్ముకాలు చేసినా, రేషన్ బియ్యం నిల్వలు చేసినా డీలర్లపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీలర్లు సకాలంలో సరుకులకు డీడీలు తీయాలని, ప్రతీనెలా ఒకటో తేదీ నుంచి సరుకులు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ గోపీకృష్ణ, చీరాలలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

సింగుపాలెంలో కేంద్ర బృందం పర్యటన


సింగుపాలెంలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

రేపల్లె రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సింగుపాలెం గ్రామంలో జరిగిన వివిధ రకాల అభివృద్ధి పనులను గురువారం కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీరోడ్లు, పంచాయతీ భవనం, కాల్వలపూడికతీత, కాల్వ గట్లు, డొంకరోడ్ల అభివృద్ధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. గ్రామంలో అమలవుతున్న పింఛన్ పథకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ చంద్ర సువార్త, ఎంపీడీవో ఎం.శోభారాణి, ఈవోపీఆర్డీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో పడి యువకుడి గల్లంతు

మరొకరిని కాపాడిన మత్స్యకారులు


గల్లంతైన సాయి

చీరాల: ప్రమాదవశాత్తు కాలువలో ఇద్దరు యువకులు పడిపోవడంతో ఒకరిని మత్స్యకారులు కాపాడగా మరొకరు గల్లంతయ్యారు. ఈఘటన గురువారం బాపట్ల మండలం అడివిపల్లెపాలెం వద్ద చోటుచేసుకుంది. చీరాల మండలం ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ సముద్రంలో కలిసే ప్రాంతంలో బాపట్ల మండలం అడివి పల్లెపాలెం వద్ద ఇంటర్‌నెట్ కేబుల్ లాగుతూ ప్రమాదవశాత్తు సాయి, శ్రీనివాసరెడ్డి అనే యువకులు కాలువలో పడ్డారు. ఈ ఘటనలో మత్స్యకారులు శ్రీనివాసరెడ్డిని సురక్షితంగా బయటకు తీసుకురాగా సాయి (22) అనే యువకుడు గల్లంతయ్యాడు. గల్లంతైన సాయిది చీరాల పట్టణంలోని శ్రీనివాసనగర్ వాసిగా గుర్తించారు. గల్లంతైన సాయి కోసం గాలింపు చేపట్టారు.

ఆర్టీసీ ఈడీ తనిఖీలు


హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

పట్నంబజారు: ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) గిడుగు వెంకటేశ్వరరావు గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిపో 1, 2 పరిధిలో తనిఖీలు నిర్వహించి, ప్రయాణికులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. సలహాలు, సూచనలు స్వీకరించారు. ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్‌తో కలిసి బస్టాండ్ పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. స్టాల్స్, హోటల్స్‌లో రేట్లు పట్టికలు ఉండేలా చూడాలని, నాణ్యమైన వస్తువులు విక్రయించాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే జరిమానా విధించాలని అధికారులకు సూచించారు. గ్యారేజీలో సిబ్బంది బస్సులను సమయానికి అందించాలని, "0" బ్రేక్ డౌన్స్ ఉండేలా చూడటంతో పాటు, టైర్ లైఫ్ 2.30లక్షల కిలోమీటర్లు తిరిగేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆర్టీసీ ఆదాయాన్ని పెంపొందించాల్సిన బాధ్యత సిబ్బంది, అధికారులపై ఉందన్నారు. బస్టాండ్‌లో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. రీజియన్ పరిధిలోని గుంటూరు 1, 2, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపో మేనేజర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్తీక మాసం నేపథ్యంలో ఆయా శైవ క్షేత్రాలకు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.